క్లుప్తంగా

వితంతు పింఛన్ల కోసం వినతి


వినతి పత్రం ఇస్తున్న వితంతువులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టుకు చెందిన వాణి, సుగుణమ్మ, గురమ్మ సోమవారం వితంతు పింఛన్ మంజూరు చేయాలని తహసీల్దారు సుబ్రమణ్యంకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, ఆరు నెలల క్రితం అనారోగ్యంతో తమ భర్తలు చనిపోయారని, అప్పటి నుండి వితంతు పింఛన్ కోసం గ్రామ సచివాలయం, మండల కార్యాలయాలకు కాళ్లరిగేలా తిరుగుతున్న పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ రాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని ఇక్కట్లను నివేదించారు. అధికారులు స్పందించి పింఛన్ మంజూరు చేయాలని కోరారు.

మహా శివరాత్రికి 25 ప్రత్యేక బస్సులు

సత్యవేడు: మహా శివరాత్రి పురస్కరించుకుని 25 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు సత్యవేడు డిపో నుంచి నడుపుతున్నట్లు డీఎం వెంకటరమణ తెలిపారు. ఊత్తుకోట నుంచి సురుటుపల్లె, రామగిరి, సదాశివకోన, వరదయ్యపాళెం నుంచి అవంతి కోన, శ్రీకాళహస్తికి భక్తుల సౌకర్యార్థం బస్సులు నడుపుతామన్నారు.

సులభతర బోధనకే జ్ఞానజ్యోతి శిక్షణ


మాట్లాడుతున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: అంగన్‌వాడీ చిన్నారులకు ఆటపాటలతో కూడిన సులభతరమైన బోధన అందించడానికే అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి పేరిట శిక్షణ ఇస్తున్నట్టు ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం చెప్పారు. సోమవారం ఆయన స్థానిక జెడ్పీ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు.ఈ శిక్షణ చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యం, ఆహార నియమాలు, పరిశుభ్రత లాంటి విషయాలు అవగతం చేసుకునేందుకు దోహద పడుతుందన్నారు. గ్రామస్థాయిలో సామాజిక చైతన్యంతోపాటు మూఢనమ్మకాలను, బాల్య వివాహాలను రూపు మాపవచ్చన్నారు. అనంతరం డీఆర్పీలు పలు అంశాలపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, సూపర్‌వైజర్ యమున తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


సుబ్రమణ్యం కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేసిన అసోసియేషన్ సభ్యులు

వరదయ్యపాళెం: మండలంలోని నాగనందాపురంలో మృతి చెందిన ఎండీయూ ఆపరేటర్ (రేషన్ బండి నిర్వాహకుడు) యానాటి సుబ్రమణ్యం కుటుంబాన్ని తిరుపతి జిల్లా ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం పరామర్శించారు. రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు కిషోర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట కుమార్ ఉన్నారు.

మహిళ మెడలో చైన్ స్నాచింగ్


తెగిన గొలుసుతో బాధితురాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి గ్రామానికి చెందిన మునిరాజమ్మ మెడలోని బంగారు చైన్‌ను గుర్తుతెలియని దుండగులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. సోమవారం మునిరాజమ్మ వెస్టువరత్తూరు గ్రామంలోని గ్రామ సచివాలయానికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం వస్తుండగా మార్గమధ్యంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి అడ్డుకున్నారు. ఆమె మెడలోని 3 సవర్ల బంగారు గొలుసును పట్టుకుని లాగారు. మునిరాజమ్మ చైన్‌ను గట్టిగా పట్టుకుని కేకలు వేయడంతో సగం చైన్‌ను తెంపుకుని, ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. మహిళ మెడపై దుండగుల చేతివేళ్ల గోళ్లు గుచ్చుకుని గాయాలయ్యాయి. చోరీకి గురైన 9 గ్రాముల బంగారు చైన్ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపారు.

భారీ బందోబస్తు


ఆలయంలో పరిశీలిస్తున్న ఎస్పీ

శ్రీకాళహస్తి: భక్తుల భద్రత కోసమే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఆయన ఆలయంలో పలు ప్రాంతాలను పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం 900 మందికిపైగా పోలీసుల బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, ఈఓ బాపిరెడ్డి ఉన్నారు.

శివపార్వతుల వైభవం చూతము రారండి

- మహా శివరాత్రికి శివాలయాల ముస్తాబు
- విద్యుత్ కాంతులతో ఆలయాలకు నూతన శోభ


సంతవేలూరులోని శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ వాలీశ్వరస్వామి ఆలయం


విద్యుత్ కాంతులతో ముస్తాబైన వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయం

వరదయ్యపాళెం: మండలంలోని పలు శివాలయాలు మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. 26న బుధవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆయా ఆలయాల్లో వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాండూరు సమీపంలోని శ్రీ జ్యోతీశ్వరాలయం, ఉబ్బలమడుగులోని సిద్ధులయ్యకోన, అరుదూరులోని శ్రీకాళహస్తీశ్వర సమేత శ్రీ జ్ఞానప్రసూనాంబికా ఆలయం, వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయం, సంతవేలూరులోని శ్రీ కామాక్షిదేవి సమేత వాలీశ్వరస్వామి ఆలయం, వెంకటరెడ్డికండ్రిగలోని ఉమామహేశ్వరస్వామి ఆలయం, బత్తలవల్లంలోని సిద్ధేశ్వరాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు.

అరుదూరులో..
అరుదూరులోని శ్రీకాళహస్తీశ్వర సమేత శ్రీ జ్ఞానప్రసూనాంబికా దేవి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన బుధవారం ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు ఆలయ అర్చకులు చెంచయ్య తెలిపారు. ఉదయం 8 గంటలకు స్వామివారికి అభిషేకం, రాత్రి 11 గంటలకు రుద్రాభిషేకం చేయనున్నట్టు చెప్పారు.

వరదయ్యపాళెంలో..
వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయంలో శివరాత్రికి ఐదు కాలాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకులు రాజేంద్రప్రసాద్ శర్మ తెలిపారు. ఆలయానికి విద్యుత్ వెలుగులతో, ప్రత్యేక పుష్పాలతో అలంకరిస్తున్నారు.

వెంకటరెడ్డికండ్రిగలో..
వెంకటరెడ్డికండ్రిగ గ్రామ సమీపంలోని ఉమమహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తామని ఆలయ అర్చకులు నిరంజనాచార్యులు తెలిపారు. ఆలయాన్ని ప్రత్యేక విద్యుత్ అలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.
ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రంలోని సిద్ధులయ్య కోనలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి బుధవారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించనున్నారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన ఈ కోనకు బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు, తడ, తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు.

సంతవేలూరులో...
సంతవేలూరులోని శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ వాలీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు వైభవంగా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మాయాని శేఖర్‌రెడ్డి, చెంచులక్ష్మి దంపతులు తెలిపారు.

విద్యుత్ కాంతులతో జ్యోతీశ్వరాలయం

జ్యోతీశ్వరాలయం సోమవారం నుండే విద్యుత్ వెలుగులతో విరాజిల్లుతోంది. ఎంతో చరిత్ర కలిగిన ఈ పురాతన ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు వరదయ్యపాళెం, సత్యవేడు, తడ, సూళ్లూరుపేట ప్రాంతాల నుంచే కాక తమిళనాడులోని ఊత్తుకోట, మాదరపాకం ప్రాంతాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు రావడం పరిపాటి. మంగళవారం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. బుధవారం ఉదయం 7 గంటలకు ఒకటవ కాలం, సాయంత్రం 4 గంటలకు రెండవ కాలం, రాత్రి 7 గంటలకు మూడవ కాలం, రాత్రి 11 గంటలకు లింగోద్భవం 4వ కాలం, అర్ధరాత్రి 2 గంటలకు ఐదవ కాలం అభిషేకాలు, గురువారం సాయంత్రం శివపార్వతుల కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు నిరంజనాచార్యులు తెలిపారు.. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.


జ్యోతీశ్వరాలయం వద్ద శివపార్వతులతో స్వాగత ఆర్చి

పీహెచ్‌సీపై కమిటీ సమీక్ష

నాగలాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ సింధు ఆధ్వర్యంలో సోమవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీలో వైద్య సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలు, మందుల అవసరత..ఇత్యాది అంశాలపై వైద్యాధికారి విజయ్ కుమార్, అరుల్ కిషోర్‌తో చర్చించారు. అత్యవసర పరిస్థితిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. అంతేకాకుండా రోజూ సగటున 250 రోగులు వైద్య సేవల నిమిత్తం వస్తున్నారని, అయితే సిబ్బంది కొరత ఉందని, దీనిని భర్తీ చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఉదయ్‌కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ జాయిస్ దానివేలు, దేశప్పన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ


పరీక్ష సామగ్రి అందిస్తున్న ఆకాంక్ష ప్రతినిధులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం గుత్తివారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ముఖ్య సలహాదారు పేరం రాధికా కిరణ్ సహకారంతో వారి కుమారుడు పేరం మోహన వంశీ తేజ పుట్టినరోజు సందర్భంగా పరీక్ష సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్దాల రవిబాబు మాట్లాడుతూ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకున్న ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థులకు నగదు బహుమతిని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మునిభూషణ్, యూటీఎఫ్ జిల్లా నాయకులు చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గజ వాహనంపై నందీశ్వరుడి విహారం


గజ వాహనంపై నందీశ్వరుడు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో శ్రీ పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు సోమవారం గజ వాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కల్ ఆధ్వర్యంలో అర్చకులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు శివనామ స్మరణతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. రాత్రి 7 గంటలకు గజ వాహనంపై శ్రీ కైలాసనాథుడు, పల్లకి వాహనంలో శ్రీ పార్వతి దేవి అధిష్టించారు. పూజలు చేసి, వివిధ రకాల హారతులు సమర్పించిన అనంతరం మంగళ వాయిద్యాలు, కోలాట భజనలు, బాణ సంచా మోత నడుమ గజ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉభయదారుడుగా కారణికి చెందిన జేబీఆర్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి.మునిరత్నం కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ మండపంలో చిన్నారులు భరతనాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఏర్పాట్లను ఆలయ ఈఓ లత, సిబ్బంది పర్యవేక్షించారు.

చెరువు తూములో ఇరుక్కుని రైతు మృతి


కలుజు కాలువ నీటిలో రైతు మృతదేహం

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండలం, రాజులపాళెం దళితవాడకు చెందిన ఓ రైతు సోమవారం చెరువునీటి వృథాను అరికట్టేందుకు తూములోకి దిగి ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. స్థానికుల కథనం.. రాజులపాళెం చెరువు నీరు వృథాగా తూము ద్వారా బయటకు వెళుతుండడంతో రైతులు తూము వద్దకు వెళ్లారు. దళితవాడుకు చెందిన మాదాసి నడిపయ్య(45) నడుముకు తాడు కట్టుకుని తూములోకి దిగాడు. అయితే తాడు తెగిపోవడంతో నీటితోపాటు తూము లోపలికి కొట్టుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. కాసేపటికే మృతదేహం నీటిలో తేలియాడుతూ బయటకు రావటంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతునికి భార్య, ముగ్గురు కుమారులున్నారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాగలాపురం: మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2004-2006 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు సోమవారం స్థానిక టీఆర్ఆర్ కళ్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ కలిశారు. తాము చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. తమ ఉన్నతికి బాటలు వేసిన అధ్యాపకులను సన్మానించి ఆశీస్సులు పొందారు. కళాశాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటునిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామచంద్రయ్య, అధ్యాపకులు దేవేంద్ర, వడివేలు, చంద్రశేఖర్, మునిరత్నం, రేఖ, సుజాత, ప్రతాప్, పూర్వ విద్యార్థులు నరేష్, సుబ్రమణ్యం, మణి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం గిరిజనుల ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు, సీపీఎం నాయకులు

సత్యవేడు: మండలంలోని పేరడంలో నివసిస్తున్న అర్హులైన గిరిజనులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆందోళనకు నేతృత్వం వహించిన సీపీఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ, రెండేళ్లుగా స్థలాల కోసం పోరాడుతున్నా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. ఇకనైనా సానుకూలంగా స్పందించాలని కోరారు. అనంతరం ఆర్ఐ సురేష్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గిరిజనులు మారెమ్మ, సుశీల, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్


సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలంలోని గురవరాజుపల్లి సబ్ స్టేషన్‌లో సోమవారం చైర్ పర్సన్ మాజీ న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయ మూర్తి అధ్యక్షతన ఆర్థిక సభ్యులు రామ మోహన్ రావు, సాంకేతిక సభ్యులు అంజనీ కుమార్ సమక్షంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలపై ఐదు ఫిర్యాదులు అందాయని డీఈఈ రమేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ చంద్ర శేఖర్ రావు, ఏఈలు హరిప్రసాద్, పుణ్యకోటి, ఎస్ఏఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయానికి మందులు, టీషర్టుల అందజేత


మందులు, టీ చొక్కాలు అందజేస్తున్న సాగర్ సిమెంట్ యాజమాన్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సాగర్ సిమెంట్స్ తరఫున నాయుడుపేటకు చెందిన డీలర్లు రమేష్, సురేష్ రూ.5 విలువైన మందులు, టీషర్టులు అందజేశారు. వాటిని ఈవో బాపిరెడ్డి వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తిరుపతికి చెందిన శుభమస్తు యాజమాన్యం అందించిన టీషర్ట్స్‌ను ఈవో బాపిరెడ్డి యువతరం సేవాసమితి సభ్యులకు అందజేశారు. ప్రతి సంవత్సరం యువతరం సభ్యులు మహాశివరాత్రి ఉత్సవాల్లో స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు పట్టువస్త్రాల సమర్పణ


శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయలలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ దుర్గమల్లీశ్వరస్వామి ఆలయం తరపున మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు పట్టువస్త్రాలను సంప్రదాయబద్ధంగా సమర్పించనున్నట్లు అందులో పేర్కొన్నారు.

ముగిసిన బ్యూటీషియన్ కోర్సు శిక్షణ


మహిళకు సర్టిఫికెట్ ఇస్తున్న రాస్ అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రాస్- జన్ శిక్షణ్ సంస్థాన్ వారి ఆధ్వర్యంలో రేణిగుంట పాంచాలి నగర్ రాస్ క్లస్టర్ కార్యాలయంలో బ్యూటీషియన్ కోర్సు 3 నెలల శిక్షణ అనంతరం ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాస్ మహిళా పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు పాల్గొన్నారు. అనంతరం మహిళలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. నాగరాజు మాట్లా డుతూ మహిళలు చేతివృత్తులు నేర్చుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది సత్యనారాయణ, సుబ్బారావు, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయండి


అధికారులతో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రిని పురస్కరించుకుని గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బాల్య వివాహాల నిర్మూలన కమిటీ సభ్యులు కోరారు. వారు సోమవారం తహసీల్దారును కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దేవుని పెళ్లిని పురస్కరించుకుని పట్టణ పరిధిలో చెక్‌పోస్టులు పెట్టి బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేసేవారని చెప్పారు. అయితే ప్రస్తుతం ఇవి ఏర్పాటు చేయలేదన్నారు. దేవుని పెళ్లి రోజున బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నిర్విరామం.. అఖండ శివనామం


శివనామం జపిస్తున్న శివస్వాములు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం గాజులమండ్యంలోని శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర ఆలయంలో 24 గంటల పాటు నిర్విరామంగా అఖండ శివనామ సంకీర్తనతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. స్వర్ణముఖి నది తీరాన వెలసిన శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున అఖండ శివనామ సంకీర్తన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నటరాజ మండపంలో శివరామ కోటి భజన బృందం అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో 24 గంటల పాటు అఖండ శివనామ సంకీర్తన ప్రారంభించారు.
రేణిగుంట ప్రసన్న చిన్నపిల్లల హాస్పిటల్ అధినేత కల్లూరు రాజేశ్వరి,డాక్టర్ ప్రసన్న కుమార్ రెడ్డి దంపతులు ఉభయ దారులుగా శ్రీ కామాక్షి దేవి, మూలస్థానేశ్వరులకు, పాలు,పెరుగు, పంచామృతాభిషేక పూజలు చేశారు. సాయంత్రం ఏడు గంటలకు ప్రధాన అర్చకులు దక్షిణామూర్తి ఆధ్వర్యంలో కలశస్థాపన, హోమం, ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు జువ్వల ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

రైతులు ఫారం పాండ్లు తవ్వించుకోవాలి


ఫారంపాండ్ల తవ్వకం పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

ఏర్పేడు(రేణిగుంట): రైతులు తమ పొలాల్లో ఉపాధి హామీ పథకం కింద ఫారంపాండ్లు తవ్వుకోవటం వల్ల సాగునీటి సమస్యను కొంతమేరకు అధిగమించవచ్చని డ్వామా పీడీ సి.వి శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. ఏర్పేడు మండలం బండారుపల్లిలో సోమవారం రైతుల పొలంలో తవ్వుతున్న ఫారం పాండ్ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫారం పాండ్ తవ్వుకోవడం వల్ల వర్షపు నీటిని ఒడిసి పట్టి నిల్వ చేసుకోవచ్చన్నారు. భూగర్భ జలాలు కూడా వృద్ధి చెంది సాగునీటి సమస్యను పరిష్కరించుకోవచ్చని సూచించారు. అనంతరం పంచాయతీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. త్వరితగతిన రోడ్డు పూర్తి చేయాలని, నాణ్యతలో లోపాలుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు డి.చంద్ర శేఖర్ రాజు, అవిలాల దేవరి, మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివ చంద్ర, టెక్నికల్ అసిస్టెంట్ రవీంద్రుడు, జూనియర్ ఇంజినీర్ బాలాజీ రావ్ తదితరులు పాల్గొన్నారు.

కామధేనువుపై పరశురామేశ్వరుడు

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండలం, గుడిమల్లంలోని పరశురామేశ్వరాలయంలో జరుగుతున్న మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లు కామధేను వాహనంలో ఊరేగుతూ కనువిందు చేశారు. ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు ఆధ్వర్యంలో అభిషేక పూజలు నిర్వహించారు. ఇదిలావుండగా తమిళనాడు రాష్ట్రం ధర్మపురి ఆదీనం షణ్ముగ దేశిగ జ్ఞానసంబంధ పరమాచార్య ఆశ్రమం నుంచి స్వాములు సోమవారం గుడిమల్లం ఆలయాన్ని దర్శించుకున్నారు.

రైతు విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోండి


నారాయణవనం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త నిర్వహించే రైతు విశిష్ట సంఖ్య నమోదు నిమిత్తం రైతులు తమ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శోభారాణి కోరారు. సోమవారం మండలంలో పాలమంగళం, అరణ్యంకండ్రిగ రైతు సేవా కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆమె మాట్లాడారు. మండలంలోని 3069 మంది పీఎం కిసాన్ రైతులను మూడు క్లస్టర్లుగా చేశామని, పాలమంగళం, అరణ్యం కండ్రిగ, ఎరికంబట్టు క్లస్టర్ పరిధిలో రైతులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు.

ఆర్థికంగా పురోగతి సాధించండి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నారాయణవనం: తమ పెట్టుబడులను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకుంటూ ఆర్థికంగా పురోగతిని సాధించాలని పలువురు అన్నారు. సోమవారం మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా సౌజన్యంతో అర్థిక అక్షరాస్యతపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. పుత్తూరు నోడల్ బ్యాంకు మేనేజర్ హరిత మాట్లాడుతూ, కుటుంబ బడ్జెట్, ప్లానింగ్, మైక్రో సేవింగ్‌పై ప్రతి మహిళ అవగాహన పెంచుకోవాలన్నారు. సంఘాలు తీసుకునే బ్యాంకు రుణాలను సరైన ప్రణాళికతో వినియోగించుకుంటే మంచి లాభాలను గడించే అవకాశం ఉందన్నారు. పీఎంఎస్ బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై, డిజిటల్ లావాదేవీలు, సైబర్ క్రైమ్, సివిల్ స్కోర్, ఎస్ఎస్‌వై, ఎన్‌పీఎస్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం మమత, విడ్స్ సీఎఫ్ఎల్ జిల్లా సీసీ చెంచయ్య, కౌన్సిలర్లు బాబు, రాజు, దొరైరాజ్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విచారణ ఆరంభం


బ్యాంకు వద్ద గుమికూడిన బాధితులు

నాగలాపురం: స్థానిక యూనియన్ బ్యాంక్‌లో అసిస్టెంట్ మెనేజర్ సూర్యతేజ చేతివాటంపై సోమవారం విచారణ చేపట్టారు. బ్యాంకు ఉన్నత అధికారులు, పోలీసుల సమక్షంలో విచారణకు శ్రీకారం చుట్టారు. బ్యాంక్‌లో తాకట్టు పెట్టిన ఖాతాధారులతో సీఐ స్వయంగా మాట్లాడి బాధిత ఖాతాదారులకు ధైర్యం చెప్పారు. మరో రెండు మూడు రోజుల్లో కేసును కొలిక్కి తీసుకొస్తామన్నారు.

ప్రైవేటు దుకాణంలో కుదువ
బ్యాంక్‌లో తాకట్టు పెట్టిన 30 మంది ఆభరణాలు బయట ప్రవేటు వడ్డీ వ్యాపార సంస్థలో తాకట్టు పెట్టినట్లు అధికారులు గుర్తించారు. అయితే వీటికి చట్టపరమైన అడ్డంకులు తలెత్తె అవకాశాలున్నాయని, వాటిని అదిగమించే దిశగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.